పాడి విప్లవానికి నాంది

- జగనన్న పాలవెల్లువ పథకం కార్యాచరణ
- ప్రారంభం కానున్న మహిళా పాల సేకరణ కేంద్రాలు

అమలాపురం రూరల్: మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏపీ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య(ఏపీడీడీసీఎఫ్) పర్యవేక్షణలో గ్రామ గ్రామాన «జగనన్న పాలవెల్లువ-మహిళా డెయిరీ సహకార సంఘాన్ని (ఎండీఎస్ఎస్) ఏర్పాటు చేసే ప్రక్రియ ఊపందుకుంది. గ్రామాల్లో మహిళా పాడి రైతులను ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేలా చేయడమే పథకం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. ఇప్పటికే గ్రామాల్లోని పాడి పశువులు, పాడి రైతుల స్థితిగతులపై ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేస్తున్నారు.

మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటు

ప్రస్తుతం గ్రామాల్లో ప్రైవేటు డెయిరీల హవా కొనసాగుతుంది. రైతులకు పాల డబ్బులను సకాలంలో చెల్లించకపోవడం, ధర నిర్ణయంలోనూ, పాల నాణ్యతను నిర్ధారించడంలోనూ పారదర్శకత లోపిస్తుందన్న వాదన ఉంది. మధ్యవర్తులు, ఏజెంట్లు పొందే కమీషన్ల భారాన్ని పాడి రైతులే భరించాల్సి వస్తుంది. జగనన్న పాలవెల్లువ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమైంది. అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో పాడి పశువుల పెంపకంగా విస్తారంగా ఉంది. రైతు భరోసా కేంద్రం ఉన్న గ్రామంలో జగనన్న పాలవెల్లువ-మహిళా డెయిరీ సహకార సంఘాన్ని(ఎండీఎస్ఎస్)ను ఏర్పాటు చేసి పాలను సేకరిస్తారు. పాల వ్యాపారాన్ని చేసుకోగల, వ్యాపారాన్ని సంరక్షించుకునే సామర్థ్యమున్న 11 మంది ప్రమోటర్లను ఎన్నుకుంటారు. మహిళలకు సౌకర్యవంతమైన పబ్లిక్ బిల్డింగ్‌లో పాలసేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పాలను సేకరించడానికి 11 మందిలో ఇంటర్ చదివిన ఒక మహిళను కార్యదర్శిగా మేనేజింగ్ కమిటీ నియమిస్తుంది. వ్యాపారంలో పొందే లాభం నుంచి కార్యదర్శికి జీతం ఇస్తారు.

ఇతర డెయిరీల కంటే ఎక్కువ ధర

జగనన్న పాలవెల్లువ పథకంలో మధ్యవర్తుల ప్రమేయం ఉండదు. దీంతో వారికి చెల్లించే కమీషన్లు రైతులకే చెందేలా చూస్తారు. లీటరు పాలకు వెన్న శాతాన్ని బట్టి ఇతర డెయిరీల కన్నా రూ.5 నుంచి రూ.10 వరకూ అదనంగా ధర లభిస్తుంది. పాల సేకరణను కంప్యూటర్ (ఏఎంసీయూ) ఆధారంగా పరీక్షించడం వల్ల అవకతవకలకు ఆస్కారముండదు. క్రమం తప్పకుండా సంవత్సర కాలంలో 180 రోజులు పాలు పోస్తే ప్రతి లీటర్‌పై అదనంగా 0.50 పైసలు చెల్లిస్తారు. పాల బిల్లులను ప్రతి 10 రోజులకు ఒకసారి రైతుల బ్యాంక్ ఖాతాలకే నేరుగా జమ చేస్తారు. పశువుల బీమా సౌకర్యం, దాణా సరఫరా తదితర సౌకర్యాలు రైతులకు అందుతాయి.



పాడి పశువులను పరీక్షిస్తున్న ఏడీఏ విజయరెడ్డి



జగనన్న పాలవెల్లువపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న ఏడీఏ విజయరెడ్డి

> **ప్రభుత్వ శాఖల సమన్వయంతో కార్యాచరణ**
>
> 
>
> జగనన్న పాలవెల్లువ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక, సామాజిక పరిస్థితులు మెరుగవుతాయి. ప్రభుత్వ శాఖల సమన్వయంతో పథకాన్ని ప్రజల ముందుకు తీసుకెళుతున్నాం. ఇప్పటికే సర్వే పూర్తి చేశాం.
>
> – ఎల్.విజయరెడ్డి, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు, అమలాపురం

క్లుప్తంగా

ఎంపీపీకు మంత్రి విశ్వరూప్ పరామర్శ



ఎంపీపీ శేషగిరిరావును పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: అపెండిక్స్‌తో బాధపడుతూ ఈ నెల 4వ తేదీన అస్వస్థతకు గురైన అల్లవరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావును కుటుంబసభ్యులు అమలాపురంలోని సంజీవని ఆస్పత్రిలో చేరించారు. ఈ నెల 5న శస్త్రచికిత్స చేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ గురువారం ఆయన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని వైద్యులు మంత్రి విశ్వరూప్‌కు వివరించారు. మంత్రి వెంట తుని పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

సువర్ణ హస్త కంకణం బహూకరణ



శివనాగరాజుకు సువర్ణ హస్త కంకణం అందిస్తున్న ప్రముఖులు

ముమ్మిడివరం: కళా సాహితీ వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలుగు పండితుడు పచ్చిమాల శివనాగరాజుకు పార్దు శతక రచయిత పుణ్యమంతుల అర్జునరావు సువర్ణ హస్త కంకణం బహూకరించారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు చేతుల మీదుగా సువర్ణ హస్త కంకణం అందించి సత్కరించారు. కార్యక్రమంలో పుల్లెప్ప వెంకటేశ్వరరావు, శతావధాని దుర్గా మల్లికార్జునరావు, డా.గూటం స్వామి, కన్నీడి వెంకటేశ్వరరావు, పి.రజని తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌ను పరిశీలించిన పీడీ



ఉప్పలగుప్తంలో మహిళా మార్ట్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శివశంకరప్రసాద్

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తంలో నూతనంగా ఏర్పాటుచేసిన మహిళా మార్ట్‌ను డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ద్వారా ఈ మహిళా మార్ట్‌లను ప్రారంభించి తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులను అందిస్తున్నామని తెలిపారు. ఉప్పలగుప్తం మార్ట్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీపీఎం విజయకుమార్, చేయూత యాంకర్ పర్సన్ శామ్యూల్, ఏపీఎం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

యానాం నుంచి ఆరుగురు ఎంపిక

యానాం: పుదుచ్చేరి పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన రాతపరీక్ష ఫలితాలు గురువారం విడుదల చేశారు. యానాం రీజియన్ నుంచి ఆరుగురు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. ఓలేటి రాజేశ్వరి, అంగాడి దేవి, పాలిమారి సుప్రజ, ఎండీ సాధిక్‌అలీ, పి.వెంకట కృష్ణారెడ్డి, పి.వెంకట సుధాకర్‌లు కానిస్టేబుల్ రాత పరీక్షలో విజయం సాధించారు. గతేడాది నవంబర్ 28న కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, ఈ ఏడాది జూన్ 4న రాత పరీక్ష జరిగింది.

కుడుపూడికి ఘన సత్కారం



శివన్నారాయణను సత్కరిస్తున్న సర్పంచ్ సూరిరాజు తదితరులు

తాళ్లరేవు: మండలంలోని పోలేకుర్రు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వెంటపల్లి సూరిరాజు అధ్వర్యంలో ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణను దుశ్శాలువా, పూలమాలలతో గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు బళ్ల సంధ్యారాణి, పలివెల శేషారావు, సమనాసి తమ్మారావు, ఎరికె వీరబాబు, సమనాసి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జేఏసీ నిరసన

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీ జేఏసీ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో అమలాపురం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గురువారం దీక్షా శిబిరంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. జిల్లా శాఖ అధ్యక్షుడు పప్పు సుబ్బారాయుడు, కార్యదర్శి పి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ దమ్మ స్వీకరణ పత్రాలు అందజేత

తాళ్లరేవు: బౌద్ధ దమ్మ విధానాన్ని అనుసరించి స్వీకరణ చేస్తామని హామీ ఇచ్చిన 12 మందికి బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ అధ్యక్షుడు వై.హరిబాబు బౌద్ధ దమ్మ స్వీకరణ పత్రాలు అందజేశారు. హరిబాబు తాళ్లరేవులోని ఒక బౌద్ధ వివాహంలో పాల్గొన్న అనంతరం ఆయన తాళ్లరేవులోని ఆనంద బోధి బుద్ధ విహారాన్ని సందర్శించారు. మండలానికి చెందిన బౌద్ధ ఉపాసకులు బీఎస్ఐ సభ్యులతో బౌద్ధ ప్రచారానికి చేయాల్సిన విధులు, విధానాలు చర్చించారు. కార్యక్రమంలో గుత్తాల సుబ్రహ్మణ్యం, వడ్డి సిద్ధార్థ, బీఎస్ఐ నాయకులు దారా సుబ్బరాజు, బీఎస్ఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎడ్ల కుటుంబరావు, మండల కార్యదర్శి దడాల రామకృష్ణ, పెయ్యల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తాళ్లరేవులోని ఆనంద బోధి బుద్ధ విహార్‌లో పత్రాలను అందజేస్తున్న హరిబాబు

విద్యా కానుకలను పంపిణీకి సిద్ధం చేయాలి

అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలు

అమలాపురం రూరల్: జగనన్న విద్యా కానుకలు పంపిణీకి సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి నాలుగో విడత జగనన్న విద్యా కానుకల పంపిణీ పురోగతిపై జిల్లా కలెక్టర్లతో జిల్లాల వారీగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ హిమాన్షుశుక్లా స్కూల్ బ్యాగులు, బెల్టులు, పాఠ్య పుస్తకాలు, డిక్షనరీలు విభాగాల వారీగా సమీక్షించారు. అమ్మ ఒడికి సంబంధించి తల్లుల ఈకేవైసీ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు సజావుగా జమయ్యేలా చూడాలన్నారు. పదో తరగతి, ఇంటర్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు మెడల్స్ అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో ముందంజలో ఉండాలి

జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ మానవత్వంతో కూడిన సేవల్లో ముందంజలో ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా రెడ్ క్రాస్ సభ్యులకు సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా రెడ్ క్రాస్ సంస్థ మొట్టమొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతోమందికి ఆపద సమయంలో రెడ్ క్రాస్ సభ్యులు అందిస్తున్న సహాయం వెలకట్టలేదనిదని కొనియాడారు. అనంతరం రెడ్‌క్రాస్ పేట్రన్ సభ్యులను సత్కరించారు. రెడ్‌క్రాస్ స్టేట్ కోఆర్డినేటర్ కుమార్, కాకినాడ జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షులు వైడీ రామారావు తదితరులు పాల్గొన్నారు.



రెడ్ క్రాస్ పేట్రన్ సభ్యులను సత్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

వలంటీర్ వ్యవస్థతో ప్రజల ముంగిటకు పాలన

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- కూనవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే పాలన తీసుకొచ్చారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్ అన్నారు. మండలంలోని కూనవరంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని కోరారు. సంక్షేమ పథకాల ద్వారా ఇంటింటికీ లబ్ధి చేకూర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. ఒకవైపు సంక్షేమం అందిస్తూ మరోవైపు అభివృద్ధి చేస్తూ నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు ఇంటింటా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కాట్రు ధనలక్ష్మి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు బద్రి బాబ్జి, పినిపే జయరాజు, సొసైటీ అధ్యక్షుడు రామాంజనేయులు, పార్టీ నాయకులు ఆకుల చిన్ని, కాట్రు కృష్ణ, నేలపాటి రమేష్, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కూనవరంలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల వివరాలను అందిస్తున్న శ్రీకాంత్

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

యానాం: నియోజకవర్గ పరిధిలో మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మత్స్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో పుదుచ్చేరి మత్స్యశాఖ ద్వారా మత్స్యకారులకు మంజూరైన 252 కొత్త వృద్ధాప్య పింఛన్లను అందజేసే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా మత్స్యకారులకు మరిన్ని పథకాలు అమలు చేయడానికి, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛను పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

వైభవంగా షిరిడీ సాయి విగ్రహ ప్రతిష్ఠ

యానాం: యానాం రాజీవ్ బీచ్ పార్క్ ఎదురుగా షిరిడీ సాయిబాబా పాలరాతి విగ్రహ ప్రతిష్ఠ, సాయి కోటి నామలిఖిత మహాయజ్ఞ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం హోమ పూజలు, షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ, ఉచిత సామూహిక సాయి సత్యవ్రతాలు, విరాట్‌సాయి స్తోత్రము, నిత్యప్రార్థన పఠనం, సత్సంగ ప్రసంగం జరిగింది. సాయి దీక్ష తీసుకున్న జి.లోవరాజు, హెచ్ఎస్ఎస్ మూర్తి, సీహెచ్ వెంకటరమణ, విశ్వప్రసాద్, ప్రియల అధ్వర్యంలో పూజలు జరిగాయి.

ఒక బైక్, ఐదు సెల్‌ఫోన్‌లు చోరీ

తాళ్లరేవు: వేరు వేరు ఇళ్లలో బైక్‌తో పాటు సెల్‌ఫోన్‌లు చోరీ చేసిన ఘటన కోరంగి పంచాయతీ సీతారామపురంలో చోటుచేసుకుంది. గురువారం తెల్లవారుజామున సీతారామపురంలో తాళ్లరేవు సచివాలయ సెక్రటరీ టేకుమూడి వేణుగోపాల్‌కు చెందిన మోటార్ బైక్, దుప్పి వాసుదేవ ఇంట్లో రెండు సెల్‌ఫోన్లు, సూర్యనారాయణ ఇంట్లో ఒక సెల్‌ఫోన్, మరో ఇంట్లో రెండు సెల్‌ఫోన్‌లు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు కోరంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

నేరస్తులకు త్వరితగతిన శిక్షలు



డీఎస్పీ రమణ

అంబాజీపేట: నేరాలకు న్యాయస్థానాలలో త్వరితగతిన శిక్షలు పడినప్పుడే క్రైం రేటు తగ్గుతుందని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ అన్నారు. అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సంచలనమైన కేసులు జరిగినప్పుడు జడ్జిలకు కేసు తీవ్రతలను ప్రత్యేకంగా వివరిస్తున్నామని, అందువల్ల నిందితులకు త్వరితగతిన శిక్షలు పడుతున్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రహదారులు ఎక్కువగా సింగిల్ లైన్‌లో ఉంటాయన్నారు. జన సాంద్రత, వ్యక్తిగత వాహనాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఇబ్బందిగా మారిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వాహన తనిఖీలు నిర్వహిస్తూ, ఈ చలనాలు విధిస్తుండటంతో కొంత మేర ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని తెలిపారు. ప్రస్తుతానికి అమలాపురంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. త్వరితగతిన డివిజన్‌ల వారీగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్, ఎస్సై ఎ.చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి శిక్షణ ప్రారంభం

కొత్తపేట: స్థానిక స్కిల్ హబ్ సెంటర్‌లో ఈ నెల 12 నుంచి అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు సంబంధించి శిక్షణ ప్రారంభమవుతుందని స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సాధనాల మౌనిక తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకూ ఏదైనా డిగ్రీ పాసై 18 నుంచి 30 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ అనంతరం ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కల్పిస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని మౌనిక వివరించారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పూజలు

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో గురువారం మాస కల్యాణాలు ఘనంగా జరిగాయి. ఆయా ఆలయాల వద్ద ఉదయం స్వామివార్లకు సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య, ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాత పాతపాటి రమణరాజు అధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిత్యాన్నదానానికి రూ.20 వేల విరాళం

వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ అవరణలో నిత్యాన్నదాన పథకానికి ఆచంట మండలం కరుగోరుమిల్లి గ్రామానికి చెందిన కంఠంశెట్టి సత్యకృష్ణ, లలిత నాగపూర్ణిమ దంపతులు రూ.20 వేల విరాళం సమర్పించారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.61,617 విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందిస్తున్న అధికారులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి కృష్ణా జిల్లా నేలకొండపల్లికి చెందిన వెన్న శ్రీనివాసరావు, నాగలక్ష్మి దంపతులు గురువారం రూ.61,617 విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అధికారులు అందించారు.

మలేరియా నిర్మూలనకు కృషి

ఆలమూరు: మలేరియా వ్యాధి నిర్మూలనకు అంతా సమష్టిగా కృషి చేద్దామని అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు నేతృత్వంలోని సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వరరావు మలేరియా నిర్మూలన మాసోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మలేరియా నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నియమాలను వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీహెచ్ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, హెచ్‌వీలు పి.ఉమ, సీహెచ్ బేబీ పాల్గొన్నారు.



జొన్నాడలో మలేరియా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది

వచ్చేనెల 15న నాటికి నాట్లు పూర్తి చేయాలి

ఆలమూరు: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట మండలాలకు చెందిన రైతులు వచ్చే నెల 15 నాటికి వరి నాట్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఏడీఏ కె.నాగేశ్వరరావు కోరారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ తొలి వారంలోనే తూర్పు డెల్టా ప్రధాన కాలువకు సాగునీరు విడుదల చేసినందున సత్వరమే ఖరీఫ్ పనులు ప్రారంభించాలన్నారు. గ్రామ సచివాలయ పరిధిలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో 7,029 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు సొంతంగా తయారు చేసిన 1318 విత్తనాలను సాగు చేసుకుంటే పంటకు తెగుళ్ల బెడద ఉత్పన్నం కాదన్నారు. ఖరీఫ్‌కు ఎరువులు కొరత లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఒక్కొక్క రైతు భరోసా కేంద్రంలో సుమారు 20 టన్నులను అందుబాటులో ఉంచామన్నారు. రైతులకు సందేహాలుంటే సత్వరమే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. ఏఓ ఎస్.లక్ష్మీలావణ్య, ఏఈఓ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

వాటర్ వర్క్స్‌లో మొరాయిస్తున్న మోటార్లు

- పిడుగులకు కాలిపోయిన రెండు విద్యుత్ మోటార్లు
- శివారు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ వాటర్ వర్క్స్‌కు తాగునీటిని పంపింగ్ చేసే విద్యుత్ మోటార్లలో రెండు మోటార్లు మొరాయించడంతో శివారు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షం, ఈదురు గాలులు, పిడుగులపాటుకు రెండు మోటార్లు విద్యుత్ షార్టేజ్‌తో కాలిపోయాయి. దీంతో పట్టణంలోని రిజర్వాయర్ల వద్ద తాగునీటిని పంపింగ్ చేసే ప్రక్రియకు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఫలితంగా 19 శివారు ప్రాంతాలకు తాగునీరు నిలిచిపోయింది.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

విద్యుత్ మోటార్లు కాలిపోయిన కారణంగా పట్టణంలోని సూర్యనగర్, బాల సదన్, దొంగ వారి వీధి, హైస్కూలు సెంటర్, నారాయణపేట, సూర్యనారాయణపేట, బండారు గార్డెన్స్, శాంతినగర్, పోలీసు క్వార్టర్స్, హెచ్‌బీ కాలనీ, ఎన్టీఆర్ మార్గ్, చింతగుంట చెరువు, శ్రీరామపురం, సుబ్బన్న కాలనీ, అశోక్ నగర్, గొల్లగూడెం, దిగువ సావరం, కార్తిక నగర్, విద్యుత్ నగర్ శివారు ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి ఆయా ప్రాంతాలకు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేసేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

రెండు రోజుల్లో సమస్యకు పరిష్కారం

వాటర్ వర్క్స్ విభాగంలో 450 కేఎల్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేసే 10 హెచ్‌పీ మోటార్లు ఎలక్ట్రికల్ షార్టేజ్ కారణంగా కాలిపోయాయి. దెబ్బతిన్న ఈ రెండు మోటార్లలో ఒక మోటారుకు ప్రత్యామ్నాయంగా మరో మోటారు ఏర్పాటుచేశారు. రెండో మోటారుకు మరమ్మతులు చేయిస్తున్నారు. రెండు రోజుల్లో మొత్తం సమస్యను పరిష్కరించి తాగునీటిని అన్ని ప్రాంతాలకు సజావుగా సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు.



పిడుగుల కారణంగా మరమ్మతుకు గురైన విద్యుత్ మోటారు

> **సాంకేతిక లోపాన్ని సరిదిద్దుతున్నాం**
>
> వాటర్ వర్క్స్ విభాగంలో ఈదురుగాలులు, పిడుగుల వల్ల ఎలక్ట్రికల్ షార్టేజ్‌తో పంపింగ్‌లో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతున్నాం. రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి సరఫరాను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం. ఈలోగా సమస్యాత్మక ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిస్తున్నాం. కౌన్సిలర్లు, ఆయా వార్డు ప్రజలు సహకరించాలి.
>
> – ఒమ్మి అయ్యప్పనాయుడు, మున్సిపల్ కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

పొద్దు వాలే వేళ.. తొలి పొద్దులా



అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఇటీవల ఎల్ఈడీ కాంతులతో ఆధునీకరించడంతో దేదీప్యమానంగా మెరుస్తుంది. రోజూ పొద్దుపోగానే వెలిగే విద్యుత్ వెలుగులు కొత్త అందాలను ఆవిష్కరిస్తున్నాయి. ఈ వేసవిలో సాయం సంధ్య సమయం దాటి పొద్దు వాలుతున్నప్పుడు ఆకాశం వర్ణరంజితంతో ప్రకృతి అందాలు ఓ పక్క, ఎల్ఈడీ వెలుగులతో మెరుస్తున్న ఆలయ ప్రాంగణం మరో పక్క మొత్తంగా నిత్యం ప్రశాంత వాతావరణం ఆవిష్కృతమవుతోంది. గురువారం పొద్దు వాలే వేళ భక్తులను కనువిందు చేసిన ఆ దృశ్యాల్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.